నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శనివారం 27 ఏప్రిల్ 2024 | KARIMNAGAR

ఇద్దరు దొంగలు.. 22 బైక్‌లు

- కరీంనగర్‌లో దొంగతనాలు
- రేణికుంటలో దాచిన ఘనులు
- జల్సాలకు అలవాటుపడి చోరీలు
- అన్నీ ఒకేకంపెనీకి చెందిన వాహనాలు
- పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి

ఏ బైక్ దొంగలైనా ఏం చేస్తరు? ఏ బైక్ కనిపించినా ఎత్తుకెళ్తరు! కానీ, ఈ ఇద్దరు దొంగలది మాత్రం సెపరేట్ రూట్! కేవలం ఒకే కంపెనీకి చెందిన వాహనాలను మాత్రమే దొంగిలించడం వీళ్ల స్పెషల్! జల్సాలకు అలవాటుపడి.. ఈజీగా మనీ సంపాదించాలనే ఉద్దేశంతో కరీంనగర్ టౌన్‌లో 22 ద్విచక్రవాహనాలను ఎత్తుకెళ్లారు. వాటిని రేణికుంటలో దాచిపెట్టడంతోపాటు కొన్నింటిని అమ్ముకున్నారు. కొంతకాలంగా నగరంలో దొంగతనాలు పెరుగడంతో రంగంలోకి దిగిన పోలీసులు, ఎట్టకేలకు ఆ నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆ చోరుల వద్ద ఒకే కంపెనీకి చెందిన వందల కీస్ ఉండడంతోనే వాహనాలను సులువుగా ఎత్తుకెళ్తున్నట్టు తెలిసింది.

ట్రాక్టర్‌లో తరలిస్తున్న స్వాధీనం చేసుకున్న బైక్‌లు

తిమ్మాపూర్, ఏప్రిల్ 26 : ఇటీవలి కాలంలో కరీంనగర్ టౌన్‌లో ద్విచక్రవాహనాల చోరీలు పెరుగడం కలకలం రేపుతున్నది. ఈ క్రమంలో తరచూ ఫిర్యాదులు రావడం పోలీసులకు తలనొప్పిగా మారింది. దీంతో రంగంలోకి దిగిన వన్‌టౌన్ పోలీసులు, ప్రత్యేకంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలోనే రేణికుంటలో నంబర్లు లేని ద్విచక్రవాహనాలు తిరుగుతున్నాయని గ్రామస్తుల ద్వారా అందిన సమాచారాన్ని తిమ్మాపూర్ పోలీసుల నుంచి తెలుసుకున్నారు. వారి సహకారంతో నిఘా పెట్టారు. శుక్రవారం తెల్లవారు జామున 6గంటల వరకే ఐదుగురు పోలీసులు రేణికుంటకు చేరుకున్నారు. ఇది వరకే చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న గోనెల శంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కూపీ లాగితే బోయిని చంద్రబాబుతో కలిసి దొంగతనాలకు పాల్పడినట్టు అంగీకరించాడు. కరీంనగర్‌లో బైక్‌లను దొంగిలిస్తూ రేణికుంటలో దాచినట్టు, కొన్నింటిని అమ్మినట్టు ఒప్పుకొన్నారు. వారి ద్వారా సేకరించిన సమాచారంతో గ్రామంలో జల్లెడ పట్టి 22 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వాటన్నింటిని పంచాయతీ కార్యాలయం వద్ద ఉంచగా.. గ్రామస్తులు చూసి నివ్వెర పోయారు. వాహనాలు అన్నీ ఒకే కంపెనీవి కావడంతో పోలీసులు కూడా ఆశ్చర్యపోయారు. ఆ బైక్‌లన్నింటినీ ట్రాక్టర్లలో ఉంచి కరీంనగర్‌లోని వన్‌టౌన్‌కు తరలించారు. కేసు ఇంకా దర్యాప్తు జరుగుతున్నదని ఎల్ఎండీ ఎస్ఐ చేరాలు తెలిపారు.

కేసీఆర్‌పై అభిమానం.. వినూత్న ప్రచారం

పెద్దపల్లి, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ): సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన గులాబీ కార్యకర్త గజభీంకార్ మనోహర్ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై అభిమానంతో ఏ ఎన్నిక వచ్చినా మద్దతుగా వినూత్నంగా ప్రచారం చేస్తున్నాడు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల వేళ ఫ్లెక్సీపై 17 మంది ఎంపీ అభ్యర్థుల ఫొటోలను ముద్రించుకొని, ఆ ఫెక్సీని తన ఒంటిపై వేసుకున్నాడు. అలాగే చేతిలో హ్యాండ్ మైక్ పట్టుకొని, ఆ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం సాగిస్తున్నాడు. కాగా, శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కాలినడకన తిరుగుతూ పాటలను మైకు ద్వారా వినిపిస్తూ.. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశాడు.

వినూత్న వేషధారణతో పెద్దపల్లిలో ప్రచారం చేస్తున్న కార్యకర్త గజభీంకార్ మనోహర్

కొమ్ములు అడ్డం వస్తున్నాయని
చెట్లనే నరికేశారు

ధర్మారం శివారు మల్లన్న గుట్ట దారిలో నరికివేసిన చెట్లు

కేసీఆర్ పాలనలో హరితహారం కింద ధర్మారం శివారు మల్లన్న దేవుడి గుట్ట రహదారిలో నాటిన మొక్కలు ఏపుగా ఎదిగాయి. ధర్మారం నుంచి ఎండపల్లి శివారు వరకు రోడ్డుకు ఇరువైపులా ఆ చెట్లు పచ్చదనంతో ఆహ్లాదం పంచుతున్నాయి. వాహనదారులు, పాదచారులకు నీడనిచ్చాయి. కానీ, ఈ చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తున్నాయనే కారణంతో ట్రాన్స్‌కో సిబ్బంది, ఈ నెల 22న కొమ్మలనే కాదు చెట్లనే నరికేశారు. దాదాపు పది చెట్లకుపైనే కొట్టి వేశారు. దీనిపై వాహనదారులు మండిపడుతున్నారు. ఇన్నాళ్లు గ్రామ పంచాయతీ సిబ్బంది కష్టపడి పెంచిన చెట్లను నరకడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ధర్మారం ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ అనిల్ కుమార్‌ను సంప్రదించగా.. తీగల కింద కొమ్మలు అడ్డుగా వస్తున్నాయనే కారణంతో చెట్లను సిబ్బంది తొలగించి ఉండొచ్చని చెప్పారు. -ధర్మారం, ఏప్రిల్ 26

శ్రీలంక అమ్మాయి.. జగిత్యాల అబ్బాయి

- హిందూ సంప్రదాయ పద్ధతిలో భూపతిపూర్‌లో ఒక్కటైన జంట

రాయికల్, ఏప్రిల్ 26: ప్రేమ ఎల్లలు దాటింది. దేశాలు దాటిపోయింది. శ్రీలంక అమ్మాయి, జగిత్యాల జిల్లా అబ్బాయి మధ్య చిగురించిన ప్రేమ పెళ్లితో ఒక్కటైంది. వివరాల్లోకి వెళ్తే.. మెట్‌పల్లి మండలం మూడు బొమ్మల మేడిపల్లి (పడమర) గ్రామానికి చెందిన జోరిగె అశోక్, శ్రీలంక దేశానికి చెందిన సమన్వి అలియాస్ మరియా జోర్డాన్ దేశంలో పనిచేస్తున్నారు. అక్కడే ఒకరి నొకరు ఇష్టపడ్డారు. ఇరు కుటుంబాలకు ఈ విషయం చెప్పగా, పెండ్లికి అంగీకరించారు. అయితే అశోక్ తల్లిదండ్రులు చనిపోవడంతో అక్క, బావ శేఖర్, పూజిత పెండ్లిపెద్దలుగా వ్యవహరించారు. శుక్రవారం రాయికల్ మండలం భూపతిపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఘనంగా వివాహం జరిపించారు. వధూవరులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆశీర్వదించారు.

వివాహంతో ఒక్కటవుతున్న మరియా, అశోక్ దంపతులు

అప్పుడు విదేశాలకు పరారు..
ఇప్పుడు ఫ్లైట్ దిగగానే అరెస్ట్

- ఆరేండ్ల కింద బాలికపై లైంగికదాడి కేసు
- తప్పించుకునేందుకు విదేశాలకు పయనం
- తిరిగి స్వదేశానికి రాగానే అదుపులోకి.. రిమాండ్

మల్యాల, ఏప్రిల్ 26: బాలికపై లైంగికదాడి కేసు నుంచి తప్పించుకునేందుకు విదేశాలకు పారిపోయిన నిందితుడిని పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. ఆరేండ్ల తర్వాత తిరిగి స్వదేశానికి రాగా.. ఫ్లైట్ దిగి బయటికి రాగానే అదుపులోకి తీసుకొని, రిమాండ్‌కు తరలించారు. వివరాల ప్రకారం.. మల్యాల ఠాణా పరిధిలో 2018లో బాలికపై సామూహిక లైంగికదాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదైంది. అప్పుడు నిందితులుగా ఉన్న సాజిత్‌ఖాన్, దోక సాయిగణేశ్, బొట్ల సాగర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అయితే నాలుగో నిందితుడైన మల్యాలకు చెందిన బావు మహేశ్ కేసు నుంచి తప్పించుకునేందుకు అప్పట్లోనే విదేశాలకు పారిపోయాడు. అప్పటి నుంచి అక్కడే ఉన్నాడు. ఆరేండ్ల తర్వాత శుక్రవారం స్వదేశానికి రాగా, ఎయిర్‌పోర్ట్ పోలీసులు జగిత్యాల జిల్లా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మల్యాల సీఐ నీలం రవి హైదరాబాద్ వెళ్లి, నిందితుడిని అరెస్ట్ చేసి జగిత్యాలకు తీసుకువచ్చారు. రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు.

బండిది పూటకో మాట

- అభివృద్ధి చేతగాకే రోజుకో వేషం
- ఐదేళ్లలో ఆయన చేసిందేమీ లేదు
- మత రాజకీయాలుతప్ప ఇంకేం లేదు
- కాంగ్రెస్ మాయమాటలు నమ్మద్దు
- మరోసారి మోసపోవద్దు
- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్
- గన్నారువరంలో మాజీ ఎమ్మెల్యే రసమయితో కలిసి రోడ్ షో

రోడ్‌షోలో మాట్లాడుతున్న కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

గన్నేరువరం, ఏప్రిల్ 26 : బండి సంజయ్‌కు మత రాజకీయాలు తప్ప అభివృద్ధి చేతకాదని, ఆయన ఐదేళ్లలో ఎంపీగా చేసిందేమీ లేదని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. ఆయనకు అభివృద్ధి చేతగాక పూటకో మాట.. రోజుకో వేషం వేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలు ప్రజలు మోసపోయారని చెప్పారు. మరోసారి అలాంటి మాయమాటలు నమ్మవద్దని, మరోసారి మోసపోవద్దని సూచించారు. గన్నేరువరంలో శుక్రవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బండి సంజయ్ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని, ఈ ఐదేళ్లలో ధర్మం.. ధర్మం అనడం తప్ప ఎంపీగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించలేదని విమర్శించారు. ఆయన అసమర్థత కారణంగానే కరీంనగర్‌కు వచ్చిన ట్రిపుల్ఐటీని కేంద్రం ఇతర రాష్ట్రాలకు తరలించిందని చెప్పారు. కేంద్ర పథకాలకు ఏటా వచ్చే నిధులను సంజయ్ తాను తెచ్చినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2014 నుంచి 2019 వరకు తాను ఎంపీగా ఉన్న సమయంలోనే మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్ తెచ్చానని, రూ.వెయ్యి కోట్లతో కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. సంజయ్‌కి సోయి ఉంటే వేములవాడ, కొండగట్టు ఆలయాలకు ఒక్క రూపాయి కూడా నిధులు ఎందుకు తీసుకురాలేదని నిలదీశారు. కాంగ్రెస్ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు అమలు చేయడం లేదని మండిపడ్డారు. 2014 నుంచి 2019 వరకు తాను ఎంపీగా ఉన్న సమయంలో గన్నేరువరం మండల కేంద్రాన్ని తాను దత్తత తీసుకుని అభివృద్ధి చేసినట్లు చెప్పారు. గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా పొత్తూరు వరకు ₹72 కోట్లతో డబుల్ రోడ్డు మంజూరు చేయించి, పనులు ప్రారంభించినా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక స్థానిక ఎమ్మెల్యే ఎందుకు పనులు సాగనివ్వడం లేదని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయని, ప్రజలు ఆ రెండు పార్టీల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంప వెంకన్న, వైస్ ఎంపీపీ స్వప్న సుధాకర్, రెడ్డవేని తిరుపతి, గడ్డం నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పాలి

రైతుల కండ్లల్లో కన్నీళ్లు కాదు, మొఖంలో చిరునవ్వులు చూడాలనే లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తెచ్చి కోటి ఎకరాలకు సాగునీరు ఇచ్చిండు. రైతుబంధు ద్వారా ₹10 వేలు, రైతు రుణమాఫీ, రైతు బీమా పథకం ద్వారా ₹5 లక్షల సాయం అందించిండు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత అంతా తారుమారైంది. నాలుగు నెలల్లోనే రాష్ట్రమంతా కరువచ్చింది. ఇది కాలం తెచ్చిన కరువు కానే కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువే. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్, బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి.

-మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

గన్నేరువరంలో రోడ్ షోకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు

నమ్మితే గోసపడుతం

- అసెంబ్లీ ఎన్నికల్లో నమ్మి నష్టపోయింది చాలు
- మళ్లీ మోసపోవద్దు
- తెలంగాణ వ్యతిరేకి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రశ్నించే గొంతుక కోసం బీఆర్ఎస్‌ను గెలిపిద్దాం
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, ఏప్రిల్ 26: 'అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధపు హామీలు, మోసపూరిత మాటలు నమ్మి నష్టపోయింది చాలు. కాంగ్రెస్ పాలన ఎట్లున్నదో నాలుగు నెలల్లోనే తెలిసిపోయింది. ఈ ఎంపీ ఎన్నికల్లోనూ ఏవేవో చెబుతున్నరు. నమ్మితే గోసపడుతం. జాగ్రత్త' అంటూ ప్రజలకు పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ వ్యతిరేకి సీఎం కావడం దురదృష్టకరమని, నాలుగు నెలల్లో ఆయన చేసిందేమీ లేదని విమర్శించారు. పెద్దపల్లిలోని శాంతినగర్ పెట్రోల్ బంక్, కునారం ఎక్స్‌రోడ్, సుభాష్‌నగర్, జెండా చౌరస్తా, అమర్ నగర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి కొప్పుల పాల్గొని, మాట్లాడారు. తనకు ప్రజా సేవే లక్ష్యమని, సమస్యల పరిష్కారంలో ముందున్నానని, అందుకే ప్రజలు ఆశీర్వదించి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలించారని గుర్తుచేశారు. బంగారు పల్లెంలో అన్నంతినే కాంగ్రెస్ అభ్యర్థికి ప్రజలు, కార్మికులు, కర్షకుల కష్టసుఖాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. నిజంగా పెద్దపల్లి ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోరుకునే కుటుంబమైతే ఇక్కడ పరిశ్రమలు, కంపెనీలు ఎందుకు పెట్టలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ రైతు బంధు ఇవ్వాలని, రైతు బీమా రెన్యూవల్ చేయాలని రేవంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలుకావాలంటే ప్రజల తరపున ప్రశ్నించే గొంతుక అయిన బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, వరి బోనస్‌పై కాంగ్రెస్ బోగస్ మాటలు మాట్లాడుతున్నదని మండిపడ్డారు. క్వింటాల్‌కు ₹500 ఇస్తామని చెప్పి ఎందుకివ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులు, కర్షకులు కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పెద్దపల్లి జిల్లాగా మారిందని, ఆ ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని కొనియాడారు. పదేళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నదని, ఇప్పుడున్న ఎమ్మెల్యేనే అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నాడని, మరి అప్పుడు ఎందుకు పెద్దపల్లి పట్టణాన్ని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఎంపీపీ బండారి స్రవంతి శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు పూదరి చంద్రశేఖర్, వునుకొండ సుజాత, సునీల్, లైశెట్టి భిక్షపతి, ఫహీం, పెంచాల శ్రీధర్, పెద్ది వెంకటేశ్, గండు రంగయ్య, వాసు, రవీందర్, బొడ్డుపల్లి రమేశ్ పాల్గొన్నారు.

అయ్యో కొడుకా.. ఎంతపనాయె

- ఇంటికొచ్చి నాల్రోజులన్నా కాకపాయెకదరా..
- ఈతకు వెళ్లి బాలుడి మృతితో కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

మణితేజ (ఫైల్)

బోయినపల్లి, ఏప్రిల్ 26 : 'అయ్యో కొడుకా.. ఇంటికొచ్చి నాల్రోజులన్నా కాకపాయెకదరా.. ఎంత పనాయెరా..' అంటూ ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన ఆ కొడుకు మృతదేహంపై ఆ తల్లి.. 'కండ్ల ముందే ఘోరం జరిగిపోయింది బిడ్డా' అంటూ ఆ తండ్రి రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కన్నీరు పెట్టించింది. బోయినపల్లి మండలం తడగొండలో శుక్రవారం జరిగిన ఈ ఘటన విషాదం నింపింది. పోలీసుల వివరాల ప్రకారం.. బోయినపల్లి మండలం తడగొండకు చెందిన చేపూరి గంగయ్య-తిరుమల దంపతులకు ఇద్దరు కొడుకులు మణితేజ(12), రిత్విక్ ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ తమ కొడుకులను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. మణితేజ గంగాధర మండలం కురిక్యాలలోని ఓ ప్రైవేటు పాఠశాల హాస్టల్‌లో ఉంటూ 7వ తరగతి , రిత్విక్ తడగొండలోనే నాలుగో తరగతి చదువుతున్నాడు. కాగా, నాలుగు రోజుల కిందట వేసవి సెలవులు ఇవ్వడంతో మణితేజ ఇంటికి వచ్చాడు. శుక్రవారం తండ్రి గంగయ్యతో కలిసి ఈత నేర్చుకునేందుకు అదే గ్రామంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఈత నేర్చుకుంటున్న క్రమంలో మణితేజ నీట మునిగిపోయాడు. తన కండ్ల ముందే కొడుకు బావిలో మునిగిపోవడంతో ఆ తండ్రి హతాశుడయ్యాడు. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకున్నారు. కరీంనగర్ నుంచి రెస్క్యూటీం చేరుకుని బావిలో నుంచి మృతదేహాన్ని బయటికి తీశారు. ఎస్ఐ పృథ్వీధర్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

కమాన్‌పూర్ : నాగారంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్

మళ్లీ మోసం చేసే కుట్ర

- గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ ఓట్లు దండుకోవాలని చూస్తున్నది
- పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ఫైర్

కమాన్‌పూర్, ఏప్రిల్ 26 : అసెంబ్లీ ఎన్నికలు మొదలు ఎంపీ ఎన్నికల వరకు ఆరు గ్యారెంటీల పేరిట కాంగ్రెస్ ఓట్లు దండుకోవాలని కుట్రలు చేస్తున్నదని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ఫైర్ అయ్యారు. ఆడబిడ్డలకు పథకాల ఆశ చూ పి మోసం చేసిన చరిత్ర ఆ పార్టీదేనని విమర్శించారు. నాడు పథకాల పేరిట ఆగం చేసినోళ్లే.. మళ్లీ మోసం చేసేందుకు వస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు నమ్మవద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా శుక్రవారం కమాన్‌పూర్ మండలంలోని రొంపికుంట, నాగారం గ్రామాల్లో ఉపాధిహామీ పని ప్రదేశాల వద్ద ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికలు వస్తేనే కాంగ్రెసోళ్లకు పథకాలు గుర్తుకొస్తాయని, ఎన్నికల తర్వాత వాటి అమలును దాటవేస్తారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను ఇంతవరకు ఎందుకు చేయలేదో ప్రజలు ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలపై ఏ మాత్రం అనుభవంలేని ఓ వ్యాపారవేత్తను తీసుకొచ్చి ఎంపీ సీటులో కూర్చోబెడితే ఏం జరుగుతుందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. స్థానికంగా ఉండే కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించుకుందామని, వారసత్వ రాజకీయాలకు ప్రజలే గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు రాచకొండ రవి, ఉప్పరి శ్రీనివాస్, మేకల సంపత్, మల్లేశ్, భూమయ్య, కొయ్యడ రవి, చిందం తిరుపతి, తాటికొండ శంకర్, కొండ వెంకటేశ్, ఆకుల గట్టయ్య, నీలం శ్రీనివాస్, రాజయ్య, సంపత్, నారాయణ, అనిల్ గౌడ్ పాల్గొన్నారు.

అర్వింద్.. పసుపు బోర్డు ఏది?

- ఎక్కడ ఏర్పాటు చేసినవో చూపించు • మతాల పేరిట చిచ్చుపెట్టడం తప్ప ఒక్క పనైనా చేసినవా..?
- కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఝూటా పార్టీలే
- నమ్మితే మోసపోతరు.. జాగ్రత్త • నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నంలో ప్రచారం

మెట్‌పల్లి : ప్రచారంలో నినదిస్తున్న నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మారుతీనగర్/మెట్‌పల్లి రూరల్/ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 26: 'ఎంపీ అర్వింద్‌కు మతాల పేరిట చిచ్చుపెట్టడం తప్ప ఏదీ చేతకాదు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఆయన చేసిందేమీ లేదు. పసుపు బోర్డు ఏర్పాటు చేశానని ప్రగల్భాలు పలుకుతున్నడు. ఎక్కడ ఏర్పాటు చేశాడో చూపించాలి. గతంలో పసుపు బోర్డు, షుగర్ ఫ్యాక్టరీ పేరిట ఓట్లు దండుకున్నడు. ఇప్పుడు మోదీ, రాముడు పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నడు' అని నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ, వేములకుర్తి, గోదూరు గ్రామాల్లో, రాత్రి మెట్‌పల్లి పట్టణంలోని బస్ డిపో, చావిడి చౌరస్తా, గోల్ హనుమాన్, అయ్యప్ప దేవాలయంతోపాటు మెట్‌పల్లి మండలంలోని బండలింగాపూర్‌లో బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లతో కలిసి ప్రచారం చేశారు. ఆయాచోట్ల మాట్లాడారు. అర్వింద్ ఎంపీగా గెలిచిన ఈ ఐదేండ్లలో ఒక్క పనీ చేయలేదని మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తులు మనకు అవసరమా..? ఆలోచించాలని సూచించారు. జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా గెలిచి ఐదేండ్లలో చేసిన పనులెంటో ప్రజలకు చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఝూటా పార్టీలేనని, ఆ పార్టీలను నమ్మి మోసపోవద్దని సూచించారు. తాను పనిచేసే వాడినని, తనకు అబద్ధాలు చెప్పడం చేతకాదని, పార్లమెంటు ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తనను ఆశీర్వదిస్తే పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని, ప్రజలకు సేవ చేస్తానని హామీ ఇచ్చారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

- కరీంనగర్ స్థానంలో 20 తిరస్కరణ, 33 ఆమోదం
- పెద్దపల్లి స్థానంలో 14 తిరస్కరణ, 49 ఆమోదం

కలెక్టరేట్/ పెద్దపల్లి, ఏప్రిల్ 26: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగిసింది. కరీంనగర్, పెద్దపల్లి స్థానాలకు గాను ఆయా జిల్లా కేంద్రాల్లోని రిటర్నింగ్ కేంద్రాల్లో శుక్రవారం ఉదయం 11 నుంచి మొదలై రాత్రి ఏడున్నర గంటల వరకు కొనసాగింది. అభ్యర్థులు, వారి తరపున హాజరైన ప్రతినిధుల సమక్షంలో కరీంనగర్, పెద్దపల్లి రిటర్నింగ్ అధికారులు, కలెక్టర్లు పమేలా సత్పతి, ముజామ్మిల్‌ఖాన్ నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కరీంనగర్ లోక్‌సభ స్థానానికి మొత్తం 53 మంది అభ్యర్థులు 94 నామినేషన్లు వేయగా, పెద్దపల్లి స్థానానికి మొత్తం 63 మంది అభ్యర్థులు 109 నామినేషన్లు దాఖలు చేశారు. వీటన్నిటిని పరిశీలించి క్రమపద్ధతిలో వివరాలు, అన్ని పత్రాలు సక్రమంగా ఉన్న నామినేషన్లు మాత్రమే అధికారులు ఆమోదించారు. లోపభూయిష్టంగా ఉండి, సక్రమంగా వివరాలు సమర్పించని వారి పత్రాలు తిరస్కరణకు గురయ్యాయి. కరీంనగర్‌లో 20మంది నామినేషన్లు తిరస్కరించి మిగతా 33 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. పెద్దపల్లిలో 14 మంది నామినేషన్లు తిరస్కరించి మిగతా 49 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. తిరస్కరణకు గురైన అభ్యర్థులకు సంబంధించిన సెక్యూరిటీ డిపాజిట్ మొత్తాన్ని తిరిగి చెల్లించనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.